



రంజాన్ వేళలు
ఇఫ్తార్(ఆదివారం-6:32)
సహర్ (సోమవారం-5:08)



మీనాక్షమ్మా.. ఇటు చూడమ్మా!

- కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు.. అనుభవరాహిత్యం
- ఏడాది గడిచినా వాస్తవ పరిస్థితిని గుర్తించని పలువురు ఎమ్మెల్యేలు
- కేడర్ విస్తరణ.. పార్టీ బలోపేతం చేయకుండా మాజీల మాదిరిగా వ్యవహారం
- పాత- కొత్త నాయకుల మధ్య కొనసాగుతున్న విభేదాలు.. స్థానికం ముంగిట ఆందోళన
- పట్టణాల్లో ఆర్భాటపు ప్రదర్శనలకు అధిక ప్రాధాన్యం
- జిల్లా అధ్యక్షుల ఎంపిక పెండింగ్.. మండల, బూత్‌స్థాయి విస్తరణ ఏదీ?

మహబూబ్‌నగర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీని గాడిలో పెట్టి.. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో సాధించిన విజయపరంపరను స్థానిక సంస్థల్లోనూ కొనసాగించాలనే ఉద్దేశంతో ఆ పార్టీ కొత్తగా రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా మీనాక్షి నటరాజన్‌ను నియమించింది. ఆమె రావడం రావడమే.. నిత్యం పార్టీ సమీక్షలు నిర్వహిస్తున్నారు. పలు జిల్లాల వారీగా కూడా పార్టీ పరిస్థితిని తెలుసుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. ఇప్పటివరకు కొన్ని జిల్లాల సమావేశాలు పూర్తికాగా, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాపై కూడా దృష్టి సారించాలని కార్యకర్తలు కోరుతున్నారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 14 స్థానాలకు గాను 12 స్థానాల్లో ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో రెండు స్థానాల్లో ఒక స్థానం కట్టబెట్టారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికలు మాత్రం అంత సులభంగా విజయం అందించే అవకాశాలు లేవని కొందరు బాహాటంగానే చెబుతున్నారు. సాధారణంగా కాంగ్రెస్‌లో అతి స్వేచ్ఛ ఉంటుంది. ఈ కారణంతో అంతర్గత కుమ్ములాటలు కూడా ఎక్కువగానే ఉంటాయి. కానీ పార్టీ పైన ఒక ఆదేశం ఇస్తే.. అది కింది వరకు అమలైనప్పుడు మాత్రమే కేడర్‌లో భరోసా ఏర్పడుతుంది.





గత అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన వారిలో మెజారిటీ కొత్త వారే. దాదాపు 8 నియోజకవర్గాల్లో మొదటిసారి ఎమ్మెల్యేలుగా గెలిచిన వారు ఉన్నారు. అయితే ఎమ్మెల్యేలుగా వారి నియోజకవర్గాలకు కావాల్సిన పనులు, మంజూరు చేసుకోవాల్సిన నిధులపై ఫోకస్ పెడుతున్నప్పటికీ.. కేడర్ విస్తరణ, పార్టీ బలోపేతంపై మాత్రం దృష్టి సారించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇందులో అనుభవ రాహిత్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఇప్పటివరకు పార్టీపరంగా స్థానిక సంస్థలను ఎలా ఎదుర్కోవాలనే విషయంపై కార్యాచరణ ప్రణాళిక లేకపోవడం ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. అధికార పార్టీకి సాధారణంగానే కొంత బలం ఉంటుంది. కానీ దాన్ని సక్రమంగా వినియోగిస్తేనే మెజారిటీ స్థానాల్లో విజయం సాధించవచ్చు.

గ్రామ స్థాయిల్లోనూ విభేదాలు..

కాంగ్రెస్ మెజారిటీ ఎమ్మెల్యేలు గెలిచిన తర్వాత

(మిగతా 6లో..)

విస్తరణపై శ్రద్ధ కరువు..

టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డిని ఆ బాధ్యతల నుంచి అధిష్ఠానం తప్పించి.. మహేశ్‌కుమార్‌గౌడ్‌ను నియమించింది. ఆ తర్వాత పార్టీ విస్తరణ.. జిల్లాలు, మండలాలు, బూత్‌స్థాయి వరకు జరగాలి. కానీ ఇప్పటివరకు జిల్లాల్లో పాత అధ్యక్షుల ఆధ్వర్యంలోనే పార్టీ నడుస్తోంది. ఉమ్మడి ఐదు జిల్లాల్లో జోగుళాంబ గద్వాల జిల్లాకు అధ్యక్షుడు లేరు. అప్పటి అధ్యక్షుడు బీఆర్ఎస్‌లో చేరి.. తర్వాత కాంగ్రెస్‌లోకి వచ్చినప్పటికీ ఆ స్థానం ఖాళీగానే ఉంది. మహబూబ్‌నగర్ జిల్లాకు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అధ్యక్షుడిగా ఉండగా.. నాగర్‌కర్నూల్ జిల్లాకు అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఒక్క నారాయణపేట, వనపర్తి జిల్లాలకు ఎమ్మెల్యేతర అధ్యక్షులు ఉన్నారు. వనపర్తి డీసీసీ అధ్యక్షుడు చిన్నారెడ్డి మనిషి. ఇప్పటికే చిన్నారెడ్డికి, ఎమ్మెల్యే మేఘారెడ్డికి విభేదాలు తీవ్రస్థాయిలో ఉన్నాయి. మంత్రి తుమ్మల పర్యటనకు కొద్దిరోజుల ముందు వరకు అంతర్గత కుమ్ములాటలు ఉండగా.. ఆ పర్యటనతో బహాటంగా విమర్శలు చేసుకున్న పరిస్థితి కనిపించింది. కొత్త కార్యవర్గాల విస్తరణ జరిగితే కొత్త అధ్యక్షుల ఎంపిక.. వారి ఆధ్వర్యంలో పార్టీ విస్తరణ సాధ్యమవుతుంది. కానీ పార్టీ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. గతంలో బీఆర్ఎస్ కూడా చాలా జిల్లాల్లో ఇదే ఫార్ములాను ఆచరించగా.. ప్రాంతీయ పార్టీ కావడంతో ఎమ్మెల్యే సెంట్రిక్‌గా పని చేశారు. కానీ కాంగ్రెస్‌లో ఆ విధానం సాధ్యం కాదనే అభిప్రాయం ఉంది. అలాగే చాలా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ఆర్భాటపు ప్రదర్శనలు చేస్తుండటం కూడా కొంత వ్యతిరేకతను తెచ్చిపెడుతోంది. బీఆర్ఎస్ హయాంలో ఎమ్మెల్యేల కేంద్రంగా రాజకీయాలు నడిచాయి. ఇప్పుడు కూడా అదే విధానంలో పని చేస్తున్నారు.



పరిశ్రమ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న కేంద్రమంత్రి అశ్విన్‌వైష్ణవ్, చిత్రంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అమర్‌రాజా చైర్మన్ గల్లా జయదేవ్ తదితరులు

అత్యాధునిక హంగులతో దివిటిపల్లి రైల్వేస్టేషన్

- స్థానికులతో కలిసి కలెక్టర్ మంచి డిజైన్ రూపొందించాలి
- అభివృద్ధిలో దివిటిపల్లి ఆగదు
- కేంద్రమంత్రి అశ్విన్‌వైష్ణవ్
- రూ.3,225 కోట్లతో నిర్మిస్తున్న అమర్‌రాజా పరిశ్రమలకు శంకుస్థాపన
- స్థానికులకు ఉద్యోగ అవకాశాలు: రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

మహబూబ్‌నగర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ అభివృద్ధి కోసం గతంలో ఎన్నడూలేని విధంగా నిధులు కేటాయిస్తున్నారని కేంద్ర రైల్వే, ఐటీశాఖ మంత్రి అశ్విన్‌వైష్ణవ్ అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పదేళ్ల క్రితం రైల్వేకు కేటాయించిన నిధుల కన్నా ప్రస్తుతం ఒక్క తెలంగాణకే ఆరురెట్ల నిధులు రూ.5337 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారని గుర్తు చేశారు. దివిటిపల్లి రైల్వేస్టేషన్‌ను అత్యాధునిక హంగులతో నిర్మిస్తామని చెప్పారు. అందుకోసం స్థానికులతో కలిసి మంచి డిజైన్ తయారు చేయాలని కలెక్టర్‌కు సూచించారు. దివిటిపల్లి ఐటీ కారిడార్‌లోని అమర్‌రాజా పరిశ్రమలో రూ.3,225 కోట్ల నిధులతో చేపడుతున్న అమర్‌రాజా గిగా ఫ్యాక్టరీ 1 నిర్మాణ పనులకు రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, టీజీఐఐటీ సంస్థ చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డితో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పరిశ్రమలో తిరిగి, అక్కడ చేపడుతున్న పనులను పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో నమస్తే బాగున్నారా అంటూ తెలుగులో ప్రసంగం ప్రారంభించారు. పుష్ప సినిమా డైలాగ్ తగ్గేదేలేను గుర్తుచేస్తూ దివిటిపల్లి అభివృద్ధి ఆగదని, నిరంతర అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. పాలమూరు కలెక్టర్ విజయేందిరబోయి, ఎస్పీ జానకిలతో పాటు ఎంపీ డీకే అరుణలను వేదికపైకి పిలిచిన ఆయన వారిని చూపిస్తూ మహిళాదినోత్సవం అంతా ఇక్కడే ఉందన్నారు. మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజాపాలనపై విశ్వాసంతో పెట్టుబడులు పెట్టేందుకు ఎన్నో పరిశ్రమలు ముందుకు

(మిగతా 6లో..)

అభ్యసన సామర్థ్యాలపై సర్వే



సర్వే కోసం ఎంపికైన నారాయణపేటలోని బాహర్‌పేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

- నారాయణపేట జిల్లాలో 50 ప్రాథమిక పాఠశాలల ఎంపిక
- రెండో తరగతి విద్యార్థుల్లో ఆంగ్లం, గణితం, తెలుగు సబ్జెక్టుల పరిశీలన
- ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు..

నారాయణపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసేందుకు విద్యాశాఖ సిద్ధం అవుతోంది. న్యాణమైన విద్యను అందించేందుకు ప్రతీ విద్యార్థి సొంతంగా చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలు సాధించేలా ఎఫ్ఎల్ఎన్ స్టడీ (కృత్యధార బోధన) కొనసాగేలా పలు కార్యక్రమాలను విద్యా శాఖ అమలు చేస్తోంది. అందులో భాగంగా ప్రాథమిక పాఠశాలల్లో బోధన, విద్యార్థుల చదువులు ఎలా సాగుతున్నాయో గుర్తించేందుకు రెండో తరగతి విద్యార్థులతో తొలిమెట్టు కార్య క్రమం లో భాగంగా సర్వే చేయనుంది. జిల్లాలో ఎంపిక చేసిన 50 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు సర్వే చేయనున్నారు. 55 మంది బీఈడీ విద్యార్థులు, సీఆర్‌పీలతో సర్వే చేయనున్నారు. సర్వేలో తేలిన అంశాల ఆధారంగా మరింత మెరుగైన బోధన అందించనున్నారు. సర్వేకు సంబంధించి జిల్లా స్థాయిలో ఇటీవల నారాయణపేట బాలికల ఉన్నత పాఠశాలలో డీఈవో గోవిందరాజులు, జిల్లా మానిటరింగ్ అధికారి విద్యాసాగర్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు.

తెలుగు, ఆంగ్లం, గణితం పరిశీలన

విద్యార్థుల్లో తెలుగు, ఆంగ్లం చదవడం, రాయడంతో పాటు గణితం ప్రక్రియలు పరీక్షించనున్నారు. ఒక్కో విద్యార్థి ఏ మేరకు నేర్చుకున్నారు?, ఇంకా ఏం కావాలి తదితర వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు. ఎంపికైన పాఠశాలల్లో విద్యార్థులు వంద శాతం హాజరయ్యేలా చూడాలని విద్యాశాఖ అధికారులు మండల అధికారులు, కాంప్లెక్స్ ప్రాధానోపాధ్యాయులను ఆదేశించారు. ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు తమ పరిధిలో పాఠశాలలను సందర్శించి ఎక్కడా ఇబ్బందులు లేకుండా సర్వే జరిగేలా చూడాలని ఆదేశించింది.

10 నుంచి సర్వే..



జిల్లాలో ఎంపిక చేసిన 50 ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు ఈనెల 10 నుంచి 12 వరకు సర్వే కొనసాగుతుంది. ఆయా పాఠశాలల విద్యార్థులు ఆ మూడు రోజుల పాటు వందశాతం హాజరయ్యేలా చూడాలి. ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్ సర్వే చేస్తారు. కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు, ఆయాపాఠశాలల ఉపాధ్యాయులు సర్వే పకడ్బందీగా జరిగేలా చూడాలి.
- గోవిందరాజులు, డీఈవో, నారాయణపేట

పోలీస్ వాహనాలను కండీషన్‌లో ఉంచుకోవాలి



పోలీస్ వాహనాల కండీషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

- నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీస్ వాహనాలను కండిషన్లో ఉంచుకోవాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ కోరారు. శనివారం నారాయణపేట పోలీస్ హెడ్‌క్వాటర్స్ గ్రౌండ్‌లో పెట్రోల్ కార్, బ్లూకోట్స్, పోలీస్ వాహనాల మెయింటెనెన్స్ గురించి ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతి భద్రతలు కాపాడటంలో పోలీసులకు వాహనాల పాధాన్యం ఎంతో అవసరం ఉంటుందన్నారు. వాహనాలను ఎ ప్పుడు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. డయల్ 100 వాహనాలు కండిషన్‌లో ఉంచుకోవాలన్నారు. వాహనాలకు ఎలాంటి మరమ్మతులు ఉన్నా వెంటనే చేయించుకోవాలన్నారు. రోజూ వాహనాలకు వాటర్ సర్వీసింగ్ చేస్తూ, శుభ్రం చేయాలన్నారు. సమయానుకులంగా ఆయిల్ సర్వీసింగ్ చేయించుకోవాలన్నారు. రాత్రి పెట్రోలింగ్ వాహనాలు నిరంతరంగా తిరగాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ లింగయ్య, ఆర్ఐ నర్సింహ, ఏంటీవో శివశంకర్ పాల్గొన్నారు.

న్యాయం చేయండి

- జాతీయ రహదారిపై బైఠాయించిన మృతుడి బంధువులు, నాయకులు
- ఊర్కొండలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్

6

షార్ట్‌సర్క్యూట్‌తో

పూరి గుడిసె దగ్ధం

- కాలిబూడిదైన రూ.2 లక్షలు
- వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అల్వాల గ్రామంలో ఘటన

7



నల్లమల అటవీ ప్రాంతంలో సర్వే చేస్తున్న ఎస్‌సీఎస్ బృందం

కదిలిస్తే ఏమౌతుందో!

- ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో భయం భయం..
- టీబీఎం ప్రాంతంలో ప్రమాద ఘంటికలు
- శిథిలాల వద్ద పెరిగిన నీటి ఊట

6

ఎస్ఎల్‌బీసీ ప్రమాదం జాతీయ విపత్తు
- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

దేశం గర్వించేలా.. మహిళా సంక్షేమ పథకాలు

- అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఎమ్మెల్యే జీఎంఆర్



మహిళా సంఘాలకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : దేశం గర్వించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు కట్టుబడి ఉందని ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం భూత్పూర్ మునిసిపాలిటీ కేంద్రంలోని కేవీఎన్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మహిళా సంఘాల ప్రత్యేక సమావేశానికి ఎమ్మెల్యే సతీ సమేతంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భార్య కవితతో కలిసి మహిళలను ఘనంగా సన్మానించారు. ప్రభుత్వం నుంచి మంజూరైన ఇందిరా మహిళా శక్తి పథకం నిధులు రూ.15 లక్షల చెక్కును సంఘాలకు అందించారు. అనంతరం మాట్లాడుతూ మహిళలకు ఇందిరా క్యాంటీన్, పెట్రోల్ బంకు, గ్రామీణ ప్రాంతాల మహిళలకు పౌల్ట్రీ, పాడి పరిశ్రమలకు వినూత్న పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించడం జరిగిందన్నారు. కార్పొరేట్లకే పరిమితమైన సోలార్ విద్యుత్ ప్లాంట్లను మహిళా సంఘాలకు అప్పజెప్పడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, మునిసిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నవీన్ గౌడ్, ఎంఈవో ఉషారాణి, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు పద్మ, చెన్నమ్మ పాల్గొన్నారు.

అత్యాధునిక హంగులతో దివిటిపల్లి రైల్వేస్టేషన్



మంత్రికి పరిశ్రమ నమూనా గురించి వివరిస్తున్న కంపెనీ ప్రతినిధులు


(5వ పేజీ తరువాయి)

వస్తున్నాయన్నారు. పెట్టుబడులు పెట్టేవారికి తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందన్నారు. ప్రస్తుతం ఇక్కడ 400 మందికి పైగా స్థానిక మహిళలు ఉద్యోగాలు చేస్తుండటం అభినందనీయమన్నారు. తెలంగాణ ఎలక్ట్రిక్ వెహికిల్ అండ్ ఎనర్జీ స్టోరేజ్ పాలసి, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీని మా ప్రభుత్వం తెచ్చిందన్నారు. అమర్‌రాజా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్ గల్లాజయదేవ్ మాట్లాడుతూ అమర్‌రాజా పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా 4,500 మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు. రూ.1,900 కోట్లతో నిర్మించనున్న అమర్‌రాజా గిగా ఫ్యాక్టరీ 1 పనులకు శంకుస్థాపన చేశామని, అల్ట్‌మిన్ ప్రైవేట్ లిమిటెడ్ లిథియం ఫెర్రో ఫాస్ఫేట్ టెక్నాలజీ ఆధారంగా బ్యాటరీలను తయారు చేయనున్నారని తెలిపారు. లోహమ్ మెటీరియల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను 20 ఎకరాల విస్తీర్ణంలో రూ.502 కోట్ల వ్యయంతో, సెల్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ క్యాన్స్, క్యాప్స్ తయారీ సంస్థను 6 ఎకరాల్లో రూ.23 కోట్లతో చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేశ్ రంజన్, తెలంగాణ ఐఐసీ వీసీ అండ్ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేందిరబోయి, ఎస్పీ జానకి, ముడా ఛైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, నాయకులు సిరాజ్‌ఖాద్రి, జహీరాబీ పాల్గొన్నారు.

కదిలిస్తే ఏమౌతుందో..!

- ఎస్ఎల్‌బీసీ సొరంగంలో భయం భయం..
- టీబీఎం ప్రాంతంలో ప్రమాద ఘంటికలు
- శిథిలాల తొలగింపు ప్రాంతంలో పెరిగిన నీటి ఊట
- సొరంగం లోపల 14-15 కిలో మీటర్ల వరకు నీటి ప్రవాహం, రాళ్లు మట్టితో కలిగిన కొండ ప్రాంతం
- ఎన్‌సీఎస్ శాస్త్రవేత్త అంబికపతి

దోమలపెంట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్‌బీసీ సొరంగంలో ఎస్ఎల్‌బీసీ సొరంగంలో శిథిలాలు కూలి పడి వందల కోట్ల విలువైన టీబీఎం మిషన్‌తో ధ్వంసం కావడంతో పాటు 8 మంది కార్మికులు చిక్కుకున్న ప్రాంతంలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ప్రస్తుతం టీబీఎం మిషన్ చిక్కుకున్న ప్రాంతానికి 100 మిటర్ల దూరంలో రెస్క్యూ బృందాలు తవ్వకాలు చేపడుతున్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతం నుంచి టీబీఎం మిషన్ 30 మీటర్లు ముందుకు రాగా, అక్కడి నుంచి 16 మీటర్ల దూరంలో ఒక మృతదేహం ఆనవాళ్లు గుర్తించారు. మరో 50 మీటర్ల దూరంలో మరో మృతదేహం ఉన్నట్లు కేరళకు చెందిన క్యాడవర్ డాగ్స్ గుర్తించినట్లు రెస్క్యూ బృందంలో పాల్గొన్న అధికారులు పేర్కొంటున్నారు. 13.9 కిలో మీటర్ల నుంచి ముందుకు చాలా ప్రమాద కర పరిస్థితులు ఉన్నాయి. టీబీఎం మిషన్ ఉన్న ప్రాంతంలో ఎటువంటి తవ్వకాలు జరిపినా శిథిలాలు కూలి భారీ ప్రమాదం సంభవంచ వచ్చని వివిధ సర్వేలు ఇచ్చిన రిపోర్టు ఆధారంగా అధికారులు భావిస్తున్నారు.



సహాయక పనులు చేపడుతున్న సిబ్బంది

- సొరంగం లోపల కూలిన శిథిలాల ప్రాంతంలో ఎటువంటి పరిస్థితులు ఉన్నాయి. ఇక ముందు పనులు కొనసాగించాలంటే ఎలువంటి ఇబ్బందులు ఎదురవుతాయన్న నివేదికను తయారు చేసేందుకు గత పది రోజులుగా నల్లమల అటవీ ప్రాంతంలో కుడితిపెంట టేకుల సొరువ ప్రాంతాల్లో ఎన్‌జీఆర్ఐ, ఎన్‌సీఎస్ సంస్థలు సర్వే బృందాలు అధ్యాయనం చేస్తున్నారు. భూమిపై భాగం నుంచి 469 మీటర్ల లోతులో ప్రస్తుతం ప్రమాదం జరిగిన ప్రాంతం 14వ కిలో మిటర్ నుంచి 15 కిలో మీటర్ వరకు భూమిలో భారీగా నీటి ఊట, మట్టి దిబ్బలు కొండరాళ్లు ఉన్నట్లు సిస్మో మీటర్ల ద్వారా గుర్తించామని ఎన్‌సీఎస్ సర్వే బృందం సైంటిస్టు అంబికపతి పేర్కొన్నారు. ఈ సర్వే మరికొన్ని రోజులు జరిపిన తర్వాత పూర్తి నివేదిక ప్రభుత్వానికి అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.



సర్వేకు ఉపయోగించే సిస్మో మీటర్ పరికరాలు

ఎస్ఎల్‌బీసీ ప్రమాదం జాతీయ విపత్తు



సహాయక చర్యల గురించి అడిగి తెలుసుకుంటున్న మంత్రి

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి

నాగర్‌కర్నూల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఎల్‌బీసీలో జరిగిన ప్రమాద సంఘటన ఒక జాతీయ విపత్తు అని సొరంగంలో చిక్కుకున్న కార్మికులను రక్షించడానికి సహాయక చర్యల్లో ప్రపంచంలోని అత్యుత్తమ సాంకేతికతను వినియోగిం చుకుంటున్నామని రాష్ట్ర నీటిపారుదల పౌరస రఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు.

శనివారం ఉదయం అచ్చంపేట శాసనసభ్యుడు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణతో కలిసి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దోమల పెంట ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను సందర్శించి వివిధ రంగాల నుంచి పని చేస్తున్న రెస్క్యూ బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సొరంగంలో చిక్కుకున్న కార్మికులను గుర్తించేందుకు ఇప్పటి వరకు జరిగిన పురోభివృద్ధిపై రెస్క్యూ ఆపరేషన్‌ను పర్యవేక్షణ చేస్తున్న రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కార్యదర్శి అరవింద్‌కుమార్, ఆర్మీ కమాండెంట్ పరీక్షిత్ మెహ్రా మంత్రికి వివరించారు. ఎన్‌జీఆర్ఐ జియోగ్రాఫికల్ సర్వే ఆఫ్ ఇండియా, రోబోటిక్ రంగాల నిపుణులతో చర్చించి సహాయక చర్యలు వేగంగా జరగకపోవడానికి గల కారణాలు, అడ్డంకులు వాటిని అధిగమించడానికి చేపట్టాల్సిన చర్యలపై సలహాలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి వివరిస్తూ సహాయక చర్యల్లో అవాంతరాలను అధిగమిస్తూ వేగంగా సహాయక చర్యలు కొనసాగుతాయన్నారు. సొరంగం లోపల సరిగ్గా ఆక్సిజన్ స్థాయి లేకపోవడం, నీరు అధికంగా ఊరటం, టీబీఎం యొక్క దృఢమైన లోహ శకలాలు, రాళ్లు, మట్టితో కూరుకుపోయి ఇబ్బందులు ఉన్నప్పటికీ సహాయక చర్యలు కొనసాగించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. రెస్క్యూ ఆపరేషన్‌లో పని చేసే కార్మికులు అధికారులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని భరోసానిచ్చారు. త్వరగా కార్మికులను గుర్తించేందుకు ప్రపంచంలోని అత్యుత్తమ సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు.

ఎంత నిధులు ఖర్చు అయిన సరే ప్రభుత్వం భరించేందుకు సిద్ధంగా ఉందన్నారు. టీబీఎం శకలాలు, రాళ్లు, మట్టి, నీళ్లల్లో కూరుకుపోయి ఉండటంతో రెస్క్యూ చేసే సిబ్బందికి సైతం ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున అన్వి రోబోటిక్ నిపుణులతో సహాయక చర్యలు చేపట్టేందుకు 4కోట్ల రూపాయలు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు.

రోబోలను వెంటనే రంగంలోకి దింపాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సహాయక చర్యల్లో అహర్నిషలు కష్టపడి పని చేస్తున్న అధికారులు, నిపుణులు సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు. తాను తిరిగి 11వ తేదీన ఇక్కడికి వస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం ఇక్కడికి రావడమా లేదా హైదరాబాద్‌లోనే ఎస్ఎల్‌బీసీ రెస్క్యూ ఆపరేషన్‌లో పని చేస్తున్న ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కార్యదర్శి అరవింద్‌కుమార్, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్‌వైభవ్ రఘునాథ్, ఆర్మీ డోగ్రా రెజిమెంట్ కమాండెంట్ పరీక్షిత్ మెహ్రా, మిలటరీ ఇంజనీరింగ్ వికాస్ సింగ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ కమాండెంట్ ప్రసన్నకుమార్, ఎస్‌డీఆర్‌ఎఫ్ కమాండెంట్ ప్రభాకర్, సింగరేణి, రైల్వే ఎన్‌జీఆర్ఐ హైడ్రా తదితర రంగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మీనాక్షమ్మా.. ఇటు చూడమ్మా!

(5వ పేజీ తరువాయి)

తమ వెంట నడిచిన వారికే పదవులు ఇస్తామని, ఇతర పార్టీల నుంచి ఎవరినీ చేర్చుకోమని పలువురు ప్రకటించారు. ఆ తర్వాత ఎమ్మెల్సీ ఎన్నికలు రావడంతో బీఆర్ఎస్ నుంచి చేరికలను ప్రోత్సహించారు. ఇప్పుడు ఆ పాత, కొత్త నేతల మధ్య జిల్లా నుంచి గ్రామ స్థాయి వరకు విభేదాలు కనిపిస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఇంకా ఎన్నిరోజులు పడుతుందో చెప్పలేని పరిస్థితి ఉంది. అయినా గ్రామాల్లో మాత్రం వర్గాలుగా ఏర్పడి.. ఎమ్మెల్యేల వద్ద తలనొప్పులు తెస్తున్నారు.

వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ఎమ్మెల్యేల తీరుకు వ్యతిరేకంగా ప్రజలు ఓట్లు వేస్తే గెలిచారు. కానీ ఇప్పటికీ పలువురు ఎమ్మెల్యేలు తమ అంగ, అర్థబలంతో గెలిచామనే భావనలో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే పార్టీ కార్యకర్తలు, నాయకులతో బలోపేతంపై కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం లేదు. మండలాల వారీగా పార్టీ కార్యక్రమాలు కూడా నిర్వహించడం లేదు. రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం చేపట్టే సంక్షేమ కార్యక్రమాల్లో లోటుపాట్లను బీఆర్ఎస్ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తుండగా.. కాంగ్రెస్ మాత్రం వారి ఆరోపణలను ఖండించడంతోనే సరిపెడుతుంది. ప్రభుత్వం ఏం చేసింది? ఏం చేయబోతుంది? అనే విషయాల కంటే సొంత మైలేజీ, ఆర్భాటపు ప్రదర్శనలు, ఫ్లెక్సీలు, హోర్డింగులకు ప్రాధాన్యం ఇస్తున్న పరిస్థితి ఉంది. ఇదే బీఆర్ఎస్ కేడర్ ఇంకా బలంగా ఉండటానికి కారణమవుతుందని కూడా చెప్పవచ్చు.

ఈ నేపథ్యంలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ జిల్లా అధ్యక్షుల నియామకం, మండల, గ్రామస్థాయి వరకు పార్టీ విస్తరణ, కార్యక్రమాల రూపకల్పన, స్థానిక ఎన్నికలపై కసరత్తుపై దిశానిర్దేశం చేయాల్సిన అవసరం ఉంది.

ప్రశ్నార్థకం

● యాసంగి పంట సాగు

అమరచింత, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): యాసంగి సాగు రైతులకు దినదినం ఆందోళన తప్పడం లేదని చెప్పవచ్చు. వేసవి ఎండలు తీవ్రతరం కావడంతో ప్రాజెక్టులోని నీరు తగ్గుముఖం పడుతూ వస్తుంది. కర్ణాటక ప్రభుత్వం వదులుతాం అన్నా 4 టీఎంసీలలో కేవలం ఒక టీఎంసీ నీటినే నారాయణపూర్ డ్యాం నుంచి దిగువకు వదలడం, యాసంగి రైతుల్లో మరింత ఆందోళనకు గురి చేస్తుంది. జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ, కుడి కాలువల పరిధిలో 35వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ప్రాజెక్టు నీటిని ఆదా చేయడానికి అధికారులు వారబంది పద్ధతిని అమలు చేశారు. వారంలో 4 రోజులు అని సోమ, మంగళ, బుధ, గురువారాలలో వారబందిగా నీటిని విడుదల చేశారు. తీరా ఎగువ నుంచి వరద నీరు ప్రాజెక్టుకు నిలిచిపోవడంతో ఉన్నతాధికారులు వారబందిని కుదించే నిర్ణయం తీసుకున్నారు. వారంలో 4 రోజులకు బదులు కేవలం 2 రోజులే సాగు నీరు వదులుతాం అని నిర్ణయం తీసుకుని హుటాహుటిన అమలు చేసేశారు. దీంతో యాసంగి రైతులు తమ పంట ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన చెందుతున్నారు.

● 35వేల ఎకరాల పంట సాగు

ఈ ఏడాది యాసంగిలో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువ, కుడి కాలువ ఆయకట్టు కింద 35వేల ఎకరాల పంట సాగు చేసుకున్నారు. ఎడమ కాలువ పరిధిలోని 0.1 డిస్ట్రిబ్యూటర్ నుంచి రామన్‌పాడు రిజర్వాయర్ వరకు 20వేల ఎకరాలకు గద్వాల జిల్లాలోని కుడి కాలువ పరిధిలో 15వేల ఎకరాలకు అధికారులు సాగు నీటిని విడుదల చేస్తున్నారు. మొదట్లో పూర్తిస్థాయిలో సాగు కోసం నీటిని విడుదల చేసిన అధికారులు గత నెల వారబంది రూపంలో వారానికి 4 రోజులు మాత్రమే నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీరు లేవు అని యాసంగి రైతులకు వారంలో రెండు రోజుల పాటు నీటిని విడుదల చేస్తూ అమలు చేయడంతో యాసంగి పంట సాగు రైతులు అయోమయానికి గురవుతున్నారు.

● కర్ణాటక ప్రభుత్వం పైనే ఆశలు

ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి జూపల్లి కృష్ణారావు నేతృత్వంలో ఎంపీఏ బృందం కర్ణాటక వెళ్లి 4 టీఎంసీల వరకు దిగువకు నీటిని వదులుతాం అని హామీ తీసుకుని వచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం కర్ణాటక ప్రభుత్వం కేవలం ఒక టీఎంసీ నీటిని దిగువకు వదలడంతో జూరాల ప్రాజెక్టుకు మాత్రం 12వేల క్యూసెక్కుల నీటిలో కేవలం అర టీఎంసీ, 6వేల క్యూసెక్కుల వరద నీరు మాత్రమే ప్రాజెక్టుకు చేరాయి. ఆ వరద నీటిని వదిలి 15 రోజులు కావస్తున్నా మరో 3 టీఎంసీల వరద నీటిని ఇంకా కర్ణాటక ప్రభుత్వం వదలలేదు. ఆ 3 టీఎంసీల వరద నీరు జూరాలకు చేరితే యాసంగి పంటతో పాటు వేసవిలో ఉమ్మడి జిల్లాల ప్రజలు తాగునీటి ఇబ్బందుల నుంచి గట్టెక్కుతారు. ఇక కర్ణాటక ప్రభుత్వంపైనే ఆశలు అని చెప్పవచ్చు.

● ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే

● జగన్మోహన్, ఈఈ జూరాల ప్రాజెక్టు

జూరాల ప్రాజెక్టులోని నీటిని దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే 2 రోజుల పాటు నీటిని విడుదల చేయాలని నిర్ణయించాం. మిషన్ భగీరథ తదితర పథకాలు కొనసాగించాలి. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్ణయం తీసుకున్నాం. కర్ణాటక ప్రభుత్వం నీటిని వదిలితే ఉపశమనం పొందవచ్చు.

వైభవంగా నటరాజ స్వామి కల్యాణం

మహబూబ్‌నగర్ న్యూటౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): శివకామసుందరి సమేత నటరాజ స్వామివారి కల్యాణం శనివారం సాయంత్రం పట్టణంలోని టీచర్స్ కాలనీలో శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో అరుద్ర నక్షత్రంలో వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ ఇరువెంటి శ్రవణ్‌కుమార్ స్వామివారి విశిష్టతను భక్తులకు వివరించారు. కేరళాలోని నటరాజ ఆలయంలో ప్రతీ ఏటా భక్తి శ్రద్ధలతో కల్యాణం నిర్వహిస్తారన్నారు. వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో మొదటిసారిగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించడం జరిగిందన్నారు. కల్యాణానికి మాజీ కౌన్సిలర్ విఠల్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ప్రవచన కర్త బ్రహ్మశ్రీ ఇరువెంటి శ్రావణ్‌కుమార్ శర్మకు అఖిల భారత అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో ధార్మిక ప్రవచన కర్త బిరుదు ప్రదానం చేశారు. వరసిద్ధి వినాయక సేవా సమితి సభ్యులు, ప్రధాన అర్చకులు గొండ్యాల రాఘవేంద్రశర్మ, సేవా సమితి అధ్యక్షుడు సీమ నరేందర్, సంతోష్, రాజేశ్వరశర్మ, ప్రవీణ్, చంద్రకాంత్, రామకృష్ణ, పవన్, మహేందర్ పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు

సమాజ నిర్మాణంలో మహిళలది ప్రధాన పాత్ర

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి అర్బన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : సమాజ నిర్మాణంలో మహిళలది ప్రధాన పాత్ర అని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. శనివారం ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు శ్రమ జీవులని, వారిని గౌరవించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపైన ఉంటుందన్నారు. అవకాశాలు వస్తే మహిళలు అద్భుతాలు సృష్టిస్తారని కొనియాడారు. వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత పురుషులపైన ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలో మహిళల కోసం కల్యాణలక్ష్మి, వడ్డీ లేని రుణాలు, కేసీఆర్ కిట్టు, ప్రసూతి దవాఖానాలు ఏర్పాటు చేసి మహిళల అభ్యున్నతి కోసం కృషి చేశారని తెలిపారు. అనంతరం సింగిరెడ్డి వాసంతి మాట్లాడుతూ... నా ఎదుగుదలలో నా భర్త నిరంజన్‌రెడ్డి ప్రోత్సాహం ఎంతో ఉందని అన్నారు. ప్రతీ భర్త విజయం వెనకాల భార్య ప్రోత్సాహం తప్పకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, మాజీ మునిసిపల్ ఛైర్మన్ కరుణశ్రీ పాల్గొన్నారు.

గద్వాల జరీ చీరలను పరిశీలించిన రాష్ట్రపతి

గద్వాల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : అమృత్‌కా మహోత్సవ్ కార్యక్రమంలో గద్వాల జరీ చీరలను శనివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పరిశీలించారు. సౌత్ ఇండియాలో ప్రసిద్ధి చెందిన హస్తకళలు, హ్యాండ్లూమ్, అథెంటిక్ సౌత్ ఇండియన్ ఫుడ్ ఎగ్జిబిషన్ దేశ రాజధాని డిల్లీలో కొనసాగుతున్నది. ఈ ఎగ్జిబిషన్‌ను మూడు రోజుల క్రితం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌లో తెలంగాణ నుంచి 40 స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఇందులో 25 స్టాల్స్ చేనేత రంగానికి సంబంధించినవి ఉన్నాయి. వీటిలో దేశంలోనే ప్రఖ్యాతి గాంచిన జోగుళాంబ గద్వాల జిల్లాలోని గద్వాల చేనేత పట్టు చీరల స్టాల్స్ కూడా ఏర్పాటు చేశారు. 2023 కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డు గ్రహీత అక్కల శాంతారామ్ ఆధ్వర్యంలో గద్వాల చేనేత జరీ చీరల ఉత్పత్తిదారుల సంఘం తరుపున స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో గద్వాల చేనేత జరీ చీరల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు అక్కల శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు మంత్రి సురేష్ ఉన్నారు.



గద్వాల జరీ చీరలను పరిశీలిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ప్రజల సంక్షేమానికి కృషి

- మంత్రి జూపల్లి కృష్ణారావు
- అభివృద్ధి పనులకు భూమి పూజ

వీపనగండ్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్నారని ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. శనివారం వనపర్తి వీపనగండ్ల మండల పరిధిలోని సంగినేనిపల్లి, గోవర్ధనగిరి, కల్వరాల, రంగవరం గ్రామాల్లో అభివృద్ధి పనులకు మంత్రి జూపల్లి భూమి పూజ ప్రారంభోత్సవాలు చేశారు. గోపాల్‌దిన్నెలో రూ.212.53 లక్షలతో చేపట్టనున్న 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. రూ. 20లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభించారు. రంగవరంలో రూ. 80లక్షలతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అదే విధంగా గ్రామాల్లో సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీల నిర్మాణానికి భూమిపూజ చేశారు. రంగవరం, గోపాల్‌దిన్నె గ్రామానికి చెందిన ప్రజలు 357 సర్వే నెంబర్‌లో నెలకొన్న భూ సమస్యను పరిష్కరించాలని మంత్రిని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ త్వరలోనే అధికారులతో మాట్లాడి భూ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను దశల వారిగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మూడు ఎకరాల లోపు వారికి రైతు భరోసా వేయడం జరిగిందని నెలాఖరు వరకు రైతులందరికీ రైతు భరోసా డబ్బులు వారి ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. ఉచిత గ్యాస్ రూ. 500కు సిలిండర్ ఇవ్వనున్నట్లు, ఎవరికైనా రాకపోతే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీరయ్య, నాయకులు నారాయణరెడ్డి, బాల్‌రెడ్డి, ఇంద్రకంటి వెంకటేష్, సుదర్శన్‌రెడ్డి, రాంరెడ్డి, పుల్లయ్యశెట్టి, చిన్నారెడ్డి, వెంకటేష్, బుచ్చన్న, వెంకటరాజయ్య, కుర్మయ్య, రవీందర్ రెడ్డి, ధనుంజయుడు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

● జాతీయ రహదారిపై బైఠాయించిన మృతుడి బంధువులు, నాయకులు

ఊర్కొండ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండల కేంద్రంలోని కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారిపై శనివారం మృతుడి బంధువులు బైఠాయించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి మండల కేంద్రంలోని కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారిపై బైకు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన పాఠకులకు విదితమే. ఊర్కొండ మండలం రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చిన్న వెంకటయ్య (54) బైకు ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందాడు. దాంతో కుటుంబ సభ్యులు, బంధువులు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారిపై గంటపాటు బైఠాయించారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ఆ గ్రామ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతుడు నిరుపేద కుటుంబానికి చెందిన వాడని, కూలీ పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్న వ్యక్తి మృతి చెందడంతో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిందని వారికి ఆదుకోవాలని అన్నారు. మృతుడికి భార్య తెరపోగు పద్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారని, వారికి జీవనోపాధి కల్పించాల్సిన బాధ్యత ఉందని ప్రమాదానికి కారణమైన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని వారు తెలిపారు. ఎస్సై కృష్ణదేవ తమ సిబ్బందితో కలిసి బాధితులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో విరమించుకున్నారు. వారికి మద్దతుగా గ్రామ నాయకులు హరీష్, అంజనేయులు, జంగారెడ్డి, లాలయ్య తదితరులు ఉన్నారు.

మృతదేహం అప్పగింత

బైకు ప్రమాదంలో మృతి చెందిన చిన్న వెంకటయ్య మృతదేహానికి కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎసై కృష్ణదేవ తెలిపారు. భార్య తెరపోగు పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



బైఠాయించిన మృతుడి బంధువులు, నాయకులతో మాట్లాడుతున్న ఎస్సై కృష్ణదేవ

మృతదేహంతో ధర్నా

ఊర్కొండ మండలంలోని ముచ్చర్లపల్లి గ్రామానికి చెందిన వలెపు మల్లయ్య అల్లుడు రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన రాజు బైకుతో ఢీకొట్టి వ్యక్తి మృతికి కారకుడయ్యాడని మృతదేహాన్ని మల్లయ్య ఇంటి ముందు ఉంచి శనివారం రాత్రి ధర్నా చేపట్టారు. కల్వకుర్తి సీఐ నాగరాజు అక్కడికి చేరుకొని బాధిత కుటుంబాలతో మాట్లాడి మృతదేహాన్ని అక్కడి నుంచి మృతుడి స్వగ్రామం రాంరెడ్డిపల్లికి తరలించారు.

కన్నీళ్లను దిగమింగి.. కష్టాలను అధిగమించి..

ఊరు కాని ఊరు.. అర్థం కాని భాష.. తాగుడుకు బానిసైన భర్త.. కన్నబిడ్డను అమ్మకానికి పెట్టాడని తెలిసి దిగ్భ్రాంతి.. కన్న కొడుకును.. కడుపులో బిడ్డను మోసుకుంటూ కట్టుబట్టలతో పుట్టింటికి చేరుకున్నది. కన్న వారికి భారం కావొద్దనుకున్నది.. చెరుకురసం బండిని ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తోంది. ఆమే బండమీదిపల్లి తండాకు చెందిన నిర్మల..

– మహబూబ్‌నగర్ న్యూటౌన్ (ఆంధ్రజ్యోతి)


చెరుకు రసం అమ్ముతున్న నిర్మల

కన్నీళ్లను దిగమింగి, కష్టాలను అధిగమించిన ఓ మహిళ స్వయం ఉపాధితో తన కాళ్ల మీద తాను నిలబడింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం సమీపంలోని బండ మీది పల్లి సమీపంలోని తండాకు చెందిన నిర్మలకు 2012లో మహమ్మదాబాద్ మండలం నంచర్ల గ్రామానికి చెందిన నాయక్‌తో వివాహమైంది. ఆ తర్వాత వారిద్దరూ జీవనోపాధి కోసం ముంబైకి వెళ్లారు. అక్కడ భవన నిర్మాణరంగంలో పని చేస్తూ జీవనం గడుపుతున్నారు. ఈ క్రమంలో ఆమె భర్త నాయక్ మద్యానికి, జూదానికి బానిస అయ్యాడు. 2014లో వారికి అభిరామ్ జన్మించాడు. బాబు పుట్టిన తర్వాతైనా తన భర్త మారుతాడని ఆమె ఆశించింది. కానీ ఆమె ఆశలు అడియాసలు అయ్యాయి. చివరకు ఆమె భర్త తాను కట్టిన తాళిని, పుస్తే మెట్టలను సైతం తెగనమ్మి మద్యం తాగాడు. 2015 చివరలో బిడ్డను కూడా అమ్మకానికి పెట్టాడు. ఎంత చెప్పినా అతడు వినక పోవడంతో కుమారుడితో కలిసి పుట్టింటికి చేరుకుంది. 2016లో ఆమెకు రెండో సంతానంగా హర్ష జన్మించాడు. ఆ బిడ్డ పుట్టుకతోనే గుండెలో రంధ్రాలతో పుట్టాడు. తల్లిదండ్రులు ఆర్థిక సహాయం చేయడంతో రూ. 3.5 లక్షలు పెట్టి వైద్యం చేయించి, బతికించుకున్నది. ఇద్దరు బిడ్డలు, తాను ఎంతకాలం తల్లితండ్రుల మీద ఆధారపడి జీవనం గడపాలని మదన పడింది. తన కాళ్లమీద తాను నిలబడాలని నిర్ణయించుకున్నది. 8 సంవత్సరాలుగా మహబూబ్‌నగర్ పట్టణంలోని బండమీదిపల్లి చౌరస్తాలో, శివాజీ చౌక్ వద్ద చెరుకు రసం బండిని ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తోంది. చిన్న కుమారుడి వైద్యం కోసం చేసిన అప్పులను తీర్చుకున్నది. పిల్లలద్దరినీ ప్రైవేట్ పాఠశాలలో చదివిస్తోంది. ప్రస్తుతం అభిరామ్ 5వ తరగతి, హర్ష 2వ తరగతి చదువుతున్నారు. చెరకు రసం బండి నడుపుతునే ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన నిర్మల తన సొంతకాళ్లపై నిలబడి జీవనం సాగించాలనే పట్టుదలతో ఉంది.

ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయొద్దు

ఫిబ్రవరి రెండో వారం నుంచి జూన్ మొదటి వారం వరకు చెరుకు రసం వ్యాపారం సాగుతుంది. తర్వాత రోజులలో నిర్మల కూలీ పను లకు కూడా వెళ్తోంది. తన బిడ్డలను ఉన్నత స్థాయిలో నిలబెట్టడమే తన లక్ష్యమని చెప్తోంది. అందుకు ఎంత కష్టమైనా భరిస్తానని అంటోంది. సమస్యలు వచ్చినప్పుడు కృంగి పోకుండా ఎదురొడ్డి నిలబడాలని చెప్తోంది. ఒంటరి ఆడవారికి సమాజం సహాయం చేయకపోయినా, జాలి చూపక పోయినా బాధలేదు. కానీ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించొద్దని కోరుకుంటోంది. తల్లి దేవమ్మ సహకారంతో ముందుకు సాగుతున్నానన్నారు. ఏదైనా స్థిరమైన ఉపాధి కల్పించుకోవాలనుకుంటున్నా, ఆర్థిక సమస్యలతో అడుగు ముందుకు వేయలేకపోతున్నానని తెలిపింది. అయినా తాను దిగులు చెందబోనని, ఏదో ఒక రోజు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు కృషి చేస్తానని తెలిపింది.


అలంపూర్ చౌరస్తాలో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు.

రాకపోకలు సాగేదెలా

ఇంటికో బండి తెచ్చుకున్నాం



గుజ్జులఅయ్యన్న, రైతు, గోకులపాడు : మా గ్రామానికి ఇప్పటివరకు బస్సు సౌకర్యం లేదు. వివిధ పనుల మీద మండల కేంద్రానికి లేదా జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు చాలా ఇబ్బంది పడుతున్నాం. బస్సులు లేక, ఆటోలకు ఖర్చు పెట్టలేక మా ఊర్లో ప్రతీ కుటుంబం ద్విచక్రవాహనం కొనడం తప్పనిసరి అయ్యింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామానికి బస్సు సర్వీసు నడిపేందుకు చర్యలు తీసుకోవాలి.

విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు



శంకర్‌నాయుడు, రైతు, కంచుపాడు : విద్యార్థులు ఉన్నత చదువులకు, ప్రజలు, రైతులు వివిధ పనుల మీద మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లాలంటే ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. మా ఊరి మీదుగా అటు తక్కశిల, మారమునగాల, ప్రాగటూరు, శేరుపల్లి, ఇటు ఉండవల్లి, అలంపూర్ ప్రాంతాలకు బస్సు సర్వీసులు నడిపించాలి.

అదనపు బస్సులు అవసరం



అలంపూర్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు బస్సులను నడిపించాలంటే కనీసం డిపోకు మరో 20 బస్సులు అవసరం. అందుకోసం ప్రతిపాదనలను పంపించాం. అలంపూరు చౌరస్తాలో మినీ డిపో మంజూరైతే సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుంది. ప్రయాణికులు కూడా ప్రైవేటు వాహనాలు ఎక్కకుండా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణిస్తే, అదనపు బస్సులను నడిపేందుకు ప్రయత్నిస్తాం. ప్రస్తుతం ఆక్యూపెన్సీ వచ్చే రూట్లలోనే బస్సులు నడిపిస్తున్నాం.

– మురళీకృష్ణ, ఆర్టీసీ డిపో మేనేజర్, గద్వాల

- మారుమూల పల్లెలకు ఆర్టీసీ బస్సులు కరువు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు, విద్యార్థులు
- బస్ పాసులున్నా తప్పని 'పాదయాత్ర'లు
- అలంపూర్ నియోజకవర్గ ప్రజల అవస్థలు

అలంపూరు చౌరస్తా, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : 'బస్సు సర్వీసులు లేవు.. ఉన్నా అవి సమయానికి రావు.. చదువుకునేందుకో.. పనిమీదో మా ఊరి నుంచి మండల కేంద్రాలకు, పట్టణాలకు వెళ్లాలన్నా, తిరిగి రావాలన్నా.. అష్టకష్టాలు పడక తప్పడం లేదు' అని అలంపూర్ నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల ప్రజలు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఆర్టీసీ కర్నూలు డిపో నుంచి నియోజకవర్గంలోని అలంపూర్, వడ్డేపల్లి, మానవపాడు, రాజోలి, ఉండవల్లి మండలాలకు బస్సు సర్వీసులు విరివిగా ఉండేవి. రాష్ట్ర ఆవిర్భావం తరువాత ఏపీ డిపోల నుంచి గ్రామాలకు బస్సు సర్వీసులు నిలిచి పోవడం స్థానికులకు సమస్యగా మారింది. నియోజకవర్గంలోని దాదాపు 80 శాతం గ్రామాలకు బస్సు సర్వీసులు నడవడం లేదని ప్రజలు చెప్తున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల నుంచి మండల కేంద్రాలకు, పట్టణాలకు వెళ్లలంటే విద్యార్థులు పాదయాత్ర చేయక తప్పడం లేదు. కొన్ని గ్రామాలకు బస్సు సర్వీసులున్నా అవి సమ యానికి రాకపోవడంతో విద్యార్థులు, ప్రజలకు వ్యయప్రయాసలకు లోనవుతున్నారు.

పల్లె వెలుగు బస్సులు 7 మాత్రమే..

గద్వాల ఆర్టీసీ డిపోలో 103 బస్సులుండగా, వాటిలో ఎక్స్‌ప్రెస్‌లు 26, లగ్జరీ బస్సులు 7, పల్లె వెలుగు బస్సులు 70 ఉన్నాయి. అందులో అలంపూర్ నియోజకవర్గానికి 7 పల్లె వెలుగు బస్సులను మాత్రమే కేటాయించారు. దీంతో అలంపూర్ మండల కేంద్రానికి మినహా ఇతర మారుమూల పల్లెలకు పూర్తి స్థాయిలో బస్సు సర్వీసులు నడవడం లేదు. ఉన్నా అవి ఎప్పుడు వస్తాయో ఎవరికీ తెలియదు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఆటోలను ఆశ్రయిస్తూ ప్రమాదపుటంచున ప్రయాణం చేస్తు న్నా రు. ఆటోలకు చార్జీలు చెల్లించుకోలేక చాలా మంది విదార్థులు కాలినడకన రాకపోకలు సాగిస్తున్నారు. పాఠశాలాలు తెరిచి నప్పటి నుంచే తాము నడిచే వెళ్తున్నామని ఉండవల్లి మండల పరిధిలేని శేరుపల్లి, ప్రాగటూరు, మారమునగాల విద్యార్థులు వాపోతున్నారు. అలాగే ఇటిక్యాల, వడ్డే పల్లి, రాజోలి, మానవపాడు మండలాల్లో చాల గ్రామాలకు పల్లె వెలుగు బస్సు కూడా కరువైంది. కొన్ని గ్రామాల మీదుగా సర్వీసులున్నా సకాలానికి నడపకపోవడంతో ఉన్నా లేనట్లే అని స్థానికులు వాపోతున్నారు. ఉన్నత చదువుల కోసం విద్యార్థులు పల్లెటూర్ల నుంచి వడ్డేపల్లి, అలంపూర్ చౌరస్తా, గద్వాల, కర్నూల్ తదితర ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. వారి సౌకర్యం కోసం బస్సు సర్వీసుల సంఖ్యను పెంచాలని, పాఠశాలలు, కళాశాలల వేళలకు అనుగుణంగా నడిపించాలని ప్రజలు కోరుతున్నారు.

పాసులున్నా.. పాదయాత్ర తప్పదు

జోగుళాంబ గద్వాల జిల్లాలో విద్యార్థి పాసులు 1500 ఉన్నాయి. అయితే అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు నడవడం లేదు. దీంతో ఆయా గ్రామాల విద్యార్థులు పాసులను వాడుకోలేక పోతున్నారు. బస్సులు ఉన్నా సమయానికి రాకపోవడంతో బస్ పాసులను వినియోగించుకోలేక పోతున్నారు. దీంతో పలువురు విద్యార్థులు ఫ్రీగా బస్సు పాసులను కూడా తీసుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. ఆటోల్లో ప్రయాణిస్తూ వ్యయప్రయాసలకు గురవుతున్నారు. కొందరు విద్యార్థులు, కూలీలు ఆటోలకు డబ్బు ఖర్చు చేసే పరిస్థితి లేక కాలినడకన వెళ్తున్నారు.


గోకులపాడు గ్రామం నుంచి మానవపాడు మండల కేంద్రంలోని పాఠశాలకు నడిచి వెళ్తున్న విద్యార్థులు

మినీ డిపో ఏర్పాటు చేయాలి

జిల్లాలో మొత్తం 103 బస్సులు ఉన్నాయి. మారుమూల పల్లెలకు, మండల కేంద్రాలకు బస్సు సర్వీసులు నడపాలంటే అదనంగా మరో 20 బస్సులు ఆవసరం. అందు కోసం గత ప్రభుత్వ హయాం నుంచి ప్రతిపాదనలు పంపిస్తున్నా అనుమతులు రాలేదని సమాచారం. ఈ పరిస్థితుల్లో గద్వాల డిపో నుంచి అలంపూర్ నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలకు బస్సులు నడపడం సాధ్యం కాని పని. అలంపూర్ చౌరస్తాలో ఆర్టీసీ మినీ డిపో ఏర్పాటు చేస్తే సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉంది. ఈ విషయంపై అలంపూరు మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ చాలా కాలంగా పోరాడుతున్నా ఫలితం లేకపోయింది.

క్రైం కార్నర్

బావిలో పడి మహిళ మృతి

లింగాల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : దుస్తులు ఉతుకేందుకు వెళ్లిన ఓ మహిళ ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందింది. నాగర్‌కర్నూల్ జిల్లా, లింగాల మండలం, అవుసలికుంట గ్రామ సమీపంలో ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తకుంటపల్లికి చెందిన అనూష (25)కు శాయిన్‌పేటకు చెందిన పరశురామ్‌తో గత ఏడాది వివాహమైంది. జీవనోపాధి కోసం మూడు నెలల క్రితం తల్లిగారి ఊరికి చేరుకున్నారు. స్థానికంగా కూలీ పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. ఈ క్రమంలో అనూష దుస్తులు ఉతుక్కునేందుకు శనివారం భర్త, చిన్నమ్మ బక్కమ్మలతో గ్రామ సమీపంలో వ్యవసాయ బావి వద్దకు వెళ్లింది. దుస్తులు ఉతుకుతుండగా ప్రమాదవశాత్తు బావిలో జారి పడి మునిగిపోయింది. గమనించిన భర్త వెంటనే బయటకు తీయగా, అప్పటికే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సౌదిలో మృతి చెందిన రవినాయక్ అంత్యక్రియలు పూర్తి


రవినాయక్ (ఫైల్)

హన్వాడ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : 16 సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం సౌది వెళ్లి అక్కడే మృతి చెందిన రవినాయక్ (43) అంత్యక్రియలు శనివారం అయోధ్యనగర్ గ్రామ పంచాయతీ రామాలయతండాలో ముగిశాయి. తండా వాసుల కథనం ప్రకారం.. 2009లో సౌది ఆరేబియా దేశంలో మేస్త్రీ పని చేసేందుకు వెళ్లాడు. అక్కడ పని చేస్తున్న సందర్భంగా అతనిపై మోసం కేసు నమోదైంది. ఆ తర్వాత అతను మన దేశనికి వచ్చే క్రమంలో వీసా గడువు ముగియడంతో ఇబ్బందులు తలెత్తాయి. ఆదే తరుణంలో ఆరోగ్యం క్షీణించి జనవరి 26 న సౌదిలో మృతి చెందాడు. అక్కడ ఉన్న మలయాళీ సామాజిక కార్యకర్తలు రెండు నెలల పాటు ప్రయత్నించి మృతదేహన్ని స్వదేశానికి పంపించారు. శనివారం తండాకు మృతదేహం రావడంతో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడి భర్య తారాభాయి భార్త మృతదేహన్ని తీసుకొచ్చేందుకు ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి విన్నవించింది.

వ్యక్తిపై దాడి, కేసు నమోదు

- ఇద్దరు వ్యక్తులకు రిమాండ్


నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

ధరూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : భూ వివాదం నేపథ్యంలో ఓ వ్యక్తిపై దాడి చేసిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా, ధరూరు మండల పరిధిలోని దోరాన్లకు చెందిన నరసింహులుపై ఈ నెల 6వ తేదీన అదే గ్రామానికి చెందిన వాసు, కృష్ణలు కర్రలతో దాడి చేశారు. దీంతో ఆయన తలకు బలమైన గాయాలు కావడంతో కుటుంబసభ్యులు గద్వాల జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ఈ మేరకు వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టి నిందితులను శనివారం కోర్టుకు హాజరు పరిచారు. మార్చి 21వ తేదీ వరకు వారికి రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్‌ఐ కొండా శ్రీహరి తెలిపారు.

రైస్ మిల్లులో దొంగతనం

గద్వాల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండల పరిధిలో శెట్టి ఆత్మకూర్ రోడ్డులోని ఓ రైసు మిల్లులో చోరీ జరిగినట్లు రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. ఈ మేరకు మిల్లు యజమాని శీలా ఆశోక్ ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. వడ్లతో పాటు, బియ్యం, నూకలు ఎత్తుకెళ్లారని, తమ సిబ్బందితో పాటు, బయటి వ్యక్తుల సహకారం కూడా ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేసినట్లు తెలిపారు. రికార్డుల పరిశీలన తర్వాత విచారణ చేపడతామని ఎస్‌ఐ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధం

– కాలిబూడిదైన రూ.2 లక్షలు


షాట్ సర్క్యూట్‌తో కాలిపోయిన పూరి గుడిసె

పెద్దమందడి, మార్చి8 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, పెద్దమందడి మండల పరిధిలోని అల్వాల గ్రామంలో శనివారం సాయంత్రం షార్ట్‌సర్క్యూట్‌తో ఓ పూరిగుడిసె దగ్ధమైంది. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అంజలమ్మ, ఆమె కుమారుడు హరికృష్ణ మేకలు కాస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. అదనంగా 20 మేకలను కొనుగోలు చేసేందుకు హరికృష్ణ శనివారం ఉదయం పెబ్బేరు సంతకు వెళ్లాడు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో గ్రామంలోని వారి గుడిసె నుంచి మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల వారు అప్రమత్తమై నీళ్ళు పోసి మంటలను ఆర్పివేశారు. పెబ్బేరు సంత నుంచి తిరిగి వచ్చిన హరికృష్ణ, కాలిబూడిదైన గుడిసెను చూసి కన్నీటి పర్యంతం అయ్యారు. మేకల కొనుగోలు కోసం అప్పు తెచ్చిన డబ్బు రూ.2 లక్షలు కాలిబూడిదయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. నగదుతో పాటు బియ్యం, వంట సామగ్రి, దుస్తులు కూడా కాలిపోయాయని వాపోయాడు.

అనుమానాస్పద స్థితిలో ఇద్దరి మృతి

- పెద్దమందడి, ఆత్మకూరు మండలాల్లో ఘటనలు


మృతి చెందిన చంద్రాయుడు (ఫైల్)

పెద్దమందడి/ ఆత్మకూరు మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లాలో వేర్వేరు చోట్ల ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. పెద్దమందడి ఎస్‌ఐ యుగేందర్‌రెడ్డి, ఆత్మకూరు ఎస్‌ఐ నరేందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా, పెద్దమందడి మండలం, జగత్‌పల్లి శివారులోని ఓ పొలం గట్టు మీద గుర్తు తెలియని పురుషుడి (60) మృతదేహం పడి ఉంది. శనివారం మధ్యాహ్నం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్‌ఐ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకొని పరిశీలించారు. సమీపంలో పడి ఉన్న తెల్లని అంగీ జేబులో ఒక ఫోన్ నెంబర్ రాసి ఉన్న చీటి కనిపించింది. ఆ నెంబర్‌కు కాల్ చేసి మాట్లాడారు. ఈ ఫోన్ నెంబర్ ఉన్న వ్యక్తి పేరు జుట్టు కుర్మయ్య తనకు పెద్దనాన్న అవుతాడని చెప్పాడు. గోపాల్‌పేట మండలం, ఏదుట్ల గ్రామానికి చెందిన వాడని తెలిపి, అతడి కుమారుడు శ్రీనివాస్ ఫోన్ నెంబర్‌ను ఇచ్చాడు. ఆ నెంబర్‌కు మృతుడి ఫొటోను పంపించగా, తన తండ్రిగా గుర్తించాడు. తన తండ్రి గత నెల చికిత్స కోసం వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చాడని చెప్పారు. మతిస్థిమితం లేకపోవడంతో తప్పిపోయాడని తెలిపారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

● ఆత్మకూరు మండలంలోని గుంటిపల్లి గ్రామానికి చెందిన చంద్రాయుడు (48)కు 20 సంవత్సరాల క్రితం తూంపల్లి గ్రామానికి చెందిన పద్మతో వివాహం జరిగింది. ఇరువురి మధ్య తరుచూ గొడవ జరుగుతుండటంతో మూడు నెలల క్రితం పద్మ తల్లిగారి గ్రామమైన తూంపల్లికి వెళ్లింది. దీంతో చంద్రాయుడు గుంటిపల్లి గ్రామంలోని తన ఇంటిని అమ్ముకుని, పశువులను తోలుకుని 15 రోజుల క్రితం తూంపల్లి గ్రామానికి చేరుకున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం చంద్రాయుడు చనిపోయాడంటూ బంధువులు అతడి సోదరి మణెమ్మకు ఫోన్ చేసి చెప్పారు. మృతదేహాన్ని గుంటిపల్లి గ్రామానికి తీసుకొచ్చారు. తన తమ్ముడి మృతిపై పలు అనుమానాలున్నాయని పేర్కొంటూ మణెమ్మ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఏసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు.

24 గంటలలోపు ఫిర్యాదు చేయాలి

– సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ పి.సత్తయ్య

– బాధితులకు రీఫండ్ ఆర్డర్ కాపీల అందజేత


రీఫండ్ కాపీలను అందుకున్న బాధితులతో డీఎస్పీ, ఎస్‌ఐలు

గద్వాల క్రైం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల బారిన పడి డబ్బు పోగొట్టుకున్న వారు వెంటనే 1930 నెంబర్‌కు, లేదా 24 గంటలలోపు సంబంధిత పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్‌పీ పి.సత్తయ్య సూచించారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో సైబర్ నేరాల బారిన పడి 10 మంది బాధితులు రూ. 1,36,585 పోగొట్టుకున్నారు. సైబర్ సెక్యూరిటీ సిబ్బంది అందులో రూ. 1,05,558 రికవరీ చేశారు. ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్‌పీ పి.సత్తయ్య, ఇన్‌స్పెక్టర్ రాజు శనివారం జిల్లా కోర్టు ద్వారా బాధితులకు రీఫండ్ కాపీలను అందించారు. బాధితుల్లో అయిజ పోలీస్‌స్టేషన్ పరిధిలో ముగ్గురు, ధరూరులో ఇద్దరు, శాంతినగర్‌లో ఒకరు, రాజోలిలో ఒకరు, అలంపూర్‌లో ఒకరు, మల్దకల్‌లో ఒకరు, గద్వాల రూరల్ పరిధిలో మరొకరు ఉన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. బాధితులు వెంటనే ఫిర్యాదు చేస్తే సైబర్ వారియర్లు, జిల్లా సైబర్‌క్రైమ్ బ్యూరో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని డబ్బును సంబంధిత బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ చేయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గద్వాల రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్, మల్దకల్ ఎస్‌ఐ నందికర్, అయిజ ఎస్‌ఐ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత


సోలీపూర్ గ్రామంలో పోలీసులకు పట్టుబడిన రేషన్ బియ్యం

ఖిల్లాఘణపురం/ జడ్చర్ల/ లింగాల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా నిల్వ చేసిన, రవాణా చేస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు, సివిల్ సప్లై అధికారులు పట్టుకున్నారు. నిందితులపై కేసులు నమోదు చేశారు. వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండలంలోని సోలిపూర్ గ్రామానికి చెందిన తీనేటి సాయికుమార్‌రెడ్డి లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేశాడు. 85 బస్తాల్లో 34 క్వింటాళ్ల బియ్యాన్ని నిల్వ చేసుకున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం పోలీసులు, సివిల్ సప్లయ్ శాఖ ఆధ్వర్యంలో దాడులు చేశారు. అక్రమంగా నిల్వ చేసిన బియ్యాన్ని స్వాధీనం చేసుకుని వనపర్తి స్టాక్ పాయింట్‌కు తరలించారు. సివిల్ సప్లయ్ నయాబ్ తహసీల్దార్ పరమేశ్ ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

● మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలం నసరుల్లాబాద్‌లో అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఎస్‌ఐలు చంద్రమోహన్, జయప్రసాద్‌లు శుక్రవారం అర్ధరాత్రి గ్రామంలో తనిఖీలు చేపట్టారు. బొలేరో వాహనంలో 20 క్వింటాళ్ల బియ్యాన్ని (50 కిలోల చొప్పున 40 బస్తాలు) తరలిస్తుండగా పట్టుకున్నారు. బియ్యాన్ని తరలిస్తున్న కురుమూర్తి, వాహనం డ్రైవర్ రాజులపై కేసులు నమోదు చేసినట్లు సీఐ కమలాకర్ తెలిపారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, వాహనాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు. గ్రామంలోని రేషన్ దుకాణం సమీపంలోనే ఈ వాహనం పట్టుబడింది. దీంతో దుకాణంలోని స్టాక్ రిజిస్టర్‌ను అధికారులు తనిఖీ చేయగా, ఎలాంటి వ్యత్యాసం కనిపించలేదని తెలిసింది.

● నాగర్‌కర్నూల్ జిల్లా, లింగాల మండల కేంద్రంలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన హరీశ్ అనే వ్యక్తి లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఓ ఇంట్లో నిల్వ ఉంచాడు. గ్రామస్థుల సమాచారం మేరకు అచ్చంపేట సీఐ రవీందర్ సిబ్బందితో కలిసి తనిఖీ చేసి, ఎన్‌ఫోర్సుమెంట్ అధికా రులకు సమాచారమిచ్చారు. డీటీ హేమ్లానాయక్ ఆదేశం మేరకు రెవెన్యూ ఇన్ స్పెక్టర్ సీతారాం పంచనామా నిర్వహించి 20 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఇంటర్వ్యూ..

పేదల సంక్షేమానికి పెద్దపీట

» ఎంపీడీవో జయరాములు



నవాబ్‌పేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు అందించడమే తమ ముందున్న లక్ష్యమని ఎంపీడీవో జయరాములు అన్నారు. శనివా రం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలలో ప్రభుత్వ పథకాలు విధానాలు వివరించారు.

ఉపాధి పనులు సాగడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి?

అలాంటిదేమి లేదు. అన్ని గ్రామాల్లో ఇప్పుడిప్పుడే పనులు సాగుతున్నాయి. ప్రజలు ఉత్సాహంగా పని చేస్తున్నారు. వారికి అవసరమైన వసతులు కల్పించడమే ముందున్న కర్తవ్యం. పనులపై గ్రామాల వారిగా అవగాహన కల్పిస్తున్నాం.

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చేపట్టిన చర్యలు ?

గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా మిషన్ భగీరథ సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాము. అవసరమైన చోట బోరుబావులు లీజుకు తీసుకుంటాం. ప్రజలు నీటి ఎద్దడి ఉంటే తమ దృష్టికి తీసుకురావాలి.

పంచాయతీ ఎన్నికలకు సమస్యలు గుర్తించారా?

మండలంలో స్థానిక పోరుకు ప్రభుత్వ ఆదేశానుసారం అవసరమైన సామగ్రి, సిబ్బంది కేటాయింపు, పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక కేంద్రాలు గుర్తించి ప్రభుత్వానికి నివేదికలు అందజేశాం. ఎన్నికలు వాయిదా నేపథ్యంలో ఏమైన ఇబ్బందులుంటే గుర్తిస్తాం.

గ్రామాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయా?

సబ్‌ప్లాన్ నిధుల ద్వారా గ్రామాల్లో సీసీ రోడ్ల పనులు జరుగుతున్నాయి. అలాగే కొన్ని ప్రభుత్వ శాఖల్లో నిధులు మంజూరయ్యాయి. ఇప్పట్లో ఏ కార్పొరేషన్ ద్వార నిధులు మంజూరు కాలేదు.

ఇసుక ట్రాలీ ఆటో పట్టివేత

మూసాపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనకాపూర్ తండా వద్ద శనివారం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఓ ట్రాలీ ఆటో కనిపించగా డ్రైవర్ ఆటోను అక్కడే వదిలేసి పారిపోయాడు. గుర్తించిన పోలీసులు ఆటో ఎవరిది.. ఎక్కడి నుంచి ఇసుకను తరలిస్తున్నాడని విచారించినా వివరాలు తెలియకపోవడంతో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు విచారించి కేసు నమోదు చేసినట్లు మూసాపేట ఎస్ఐ వేణు తెలిపారు.

ఆలయ పునర్నిర్మాణానికి కృషి చేయాలి



సమావేశమైన ఆలయ కమిటీ సభ్యులు

మూసాపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రామస్వామి గుట్ట రామలింగేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి దాతలు కలిసికట్టుగా కృషి చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు అస్కని నరేందర్ సాగర్ అన్నారు. శనివారం ఆలయ అవరణలో ఆలయ కమిటీ సభ్యులు, దాతలు, భక్తులతో అభివృద్ధి పనులపై సమావేశం నిర్వహించారు. పురాతన కాలం నాటి మెట్లకు మరమ్మతులు, విగ్రహాల పునర్ ప్రతిష్ఠ, కొత్తగా నిర్మించిన ఆలయ మండపంలో ఫ్లోరింగ్, టైల్స్ ఏర్పాటు, ఖాళీగా ఉన్న ఆలయ కమిటీ కార్యదర్శి పోస్టును వేముల గ్రామానికి కేటాయించాలని తీర్మానించారు. గోవర్దన్, శ్రీనివాస్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, గోవింద్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాసులు, సురేష్, రవికుమార్ ఉన్నారు.

పెళ్లి ఆటో బోల్తా

- ఇద్దరికి గాయాలు

మూసాపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : అదుపు తప్పి ఆటో డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడిన సంఘటన శనివారం మండల కేంద్రంలోని జాతీయ రహదారి వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా పిచుకొండ గ్రామానికి చెందిన అంబరం వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు ఐదుగురితో కలిసి టాటా ఏసీ ఆటోలో కామారెడ్డి నుంచి ఏపీ రాష్ట్రం కడప జిల్లా షైదుకూరులో ఆదివారం జరిగే ఓ వివాహ కార్యక్రమానికి వెళ్తున్నాడు. 44వ జాతీయ రహదారి మూసాపేట వద్దకు రాగానే ఆటో అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టడంతో డివైడర్ మధ్యలో బోల్తాపడింది. ఆటో ఉన్న రామలక్ష్మి, లక్ష్మి తలకు తీవ్ర గాయాలు కాగా ఎల్అండ్‌టీ అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించారు. దూరపు ప్రయాణంతో పాటు డ్రైవర్ ఆలసటకు గురికావడంతో నిద్రమత్తులో అదుపు తప్పి ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు అందకపోవడంతో కేసు నమోదు కాలేదు.

17,254 కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి

మహబూబ్‌నగర్/జడ్చర్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ లోక్‌అదాలత్ ద్వారా 17,254 కేసులు పరిష్కారం అయ్యాయి. శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి సమక్షంలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. జిల్లా కోర్టు ఆవరణలో ఆరు బెంచీలు, జడ్చర్ల కోర్టు ఆవరణలో ఒక బెంచ్ ఏర్పాటు చేశారు. కక్షిదారులు ఉదయం నుంచే పెద్ద ఎత్తున హాజరై కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకునేందుకు చొరవ తీసుకున్నారు. జిల్లా జడ్జి కోర్టులో మోటార్ వెహికిల్ యాక్సిడెంట్ కేసులు 68 పరిష్కారం అయ్యాయి. వీరికి నష్ట పరిహారంగా రూ.11.57 కోట్లు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో పిటీషన్ ప్రీ లిటిగేషన్ కేసు ఆరో రియాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వారు భూమికి సంబంధించిన కేసును రాజీమార్గం ద్వారా రూ.18.71 కోట్లకు పరిష్కారం చేసుకున్నారు. సందర్భంగా జిల్లా న్యాయమూర్తి పాపిరెడ్డి మాట్లాడుతూ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌కు అనూహ్య స్పందన లభించిందని, కక్షిదారులు పెద్ద ఎత్తున రాజీ మార్గంలో కేసుల పరిష్కారం కోసం ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇందుకు న్యాయవాదులు, కోర్టుసిబ్బంది, పోలీసులు చేసిన కృషిని అభినందించారు. అక్షయ పాత్ర ఆధ్వర్యంలో కేసులలో వచ్చిన కక్షిదారులకు భోజన సదుపాయం కల్పించారు. జడ్చర్ల కోర్టులో 585 కేసులు పరిష్కారం కాగా, లోక్ అదాలత్‌లో రెండవ తరగతి కోర్టు ద్వారా 462 కేసులు, ఐదు బ్యాంకు కేసులు, ఎన్ఐ యాక్ట్ ఒక కేసు, ఎక్సైజ్ కేసులు 11, అడ్మిషన్ ద్వారా 65 కేసులు, ఒక సివిల్ కేసుతో పాటు 40 క్రిమినల్ కేసులు పరిష్కారం అయ్యాయి. మూడవ అదనపు జిల్లా న్యాయాధికారి ఆర్ శ్రీదేవి, జిల్లా ఫోక్సో కోర్టు న్యాయమూర్తి రాజరాజేశ్వరి, జిల్లా న్యాయాధికార సేవా సంస్థ కార్యదర్శి ఇందిర, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి రాధిక, జూనియర్ సివిల్ న్యాయాధికారి మమతారెడ్డి, 4వ అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి భావన, స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి మహ్మద్ మునవర్ పాల్గొన్నారు.

జీవితంలో సవాళ్లను ఎదుర్కోవాలి

» అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో మహిళలు



మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న భాగ్యలక్ష్మి కాలనీవాసులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని తెలంగాణ రాష్ట్ర మొదటి కమర్షియల్ పైలట్ సంజన తడకంటి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పీఆర్టీయూ ఆధ్వర్యంలో వాగ్దేవి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథులుగా సంజన తడకంటి, పీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన తల్లి ప్రోత్సాహంతోనే పైలట్ శిక్షణ పూర్తి చేశానని గుర్తుచేశారు. గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు క్రమశిక్షణకు మారు పేరు అని, వారు అన్ని రంగాల్లో అంకితభావంతో పని చేస్తున్నారన్నారు. 55 మంది ఉపాధ్యాయురాళ్లను సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు, ప్రధాన కార్యదర్శి రమాకాంత్, రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ నాగిరెడ్డి, కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి సన్మానించారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో

మహిళలపై జరుగుతున్న దాడులపై పోరాడాలని ప్రొఫెసర్ డాక్టర్ మాలవి అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ఆమె పాల్గొని, మాట్లాడారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మహిళ పారిశుధ్య కార్మికులను సన్మానించారు. మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, తపస్ జిల్లా అధ్యక్షుడు సునీల్ కుమార్, ప్రధాన కార్యదర్శి బాబునాయుడు పాల్గొన్నారు. జయప్రకాశ్ నారాయణ్ ఇంజనీరింగ్ కళాశాలలో మహిళ అధ్యాపకులకు ఆటల, పాటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి సంబురాలు జరుపుకున్నారు. భాగ్యలక్ష్మీ కాలనీలో జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.

● రాజాపూర్ : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో గ్రామ పంచాయతీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న మహిళా కార్మికులు, అంగన్‌వాడీ, ఉపాధి సిబ్బందిని సన్మానించారు.

● పాలమూరు : సమాజంలో మహిళలు కేవలం చదువు, ఉద్యోగాలు మాత్రమే కాకుండా అన్ని రంగాల్లో రాణిస్తేనే సమాజం అభివృద్ధి చెందుతుందని పీయూ హెచ్‌వోడీ డాక్టర్ మాళవి అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేవీపీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎస్సీ గర్ల్స్ హాస్టల్‌లో నిర్వహించిన సెమినార్‌కు ఆమె పాల్గొని మాట్లాడారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాణిక్యంరాజు, కుర్మయ్య, మనోహర్, పీయూ చైర్మన్ బత్తిని రాము పాల్గొన్నారు.

ఆత్మ గౌరవం మహిళల జన్మహక్కు

ఆత్మ గౌరవం మహిళల జన్మ హక్కు అని ప్రముఖ విద్యావేత్త కిరణ్మయి అన్నారు. సీపీఐ కార్యాలయంలో భారత మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంఘం జిల్లా కార్యదర్శి కె.పద్మావతి జెండావిష్కరణ చేయగా, జిల్లా అధ్యక్షురాలు భార్గవి అధ్యక్షతన 114వ అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం కేకును కట్ చేశారు. మహిళల అభ్యున్నతికి సామాజిక అణచివేత గొడ్డలి పెట్టు అని గాయని శ్యామల అన్నారు. పాత పాలమూరులో జ్ఞానసీలి మెపు బహుజన మహనీయుల శోభాయాత్ర ఆధ్వర్యంలో ప్రముఖ మహిళలను సన్మానించారు. ఎస్ఐలు శైలజ, సాయి నిర్మల, పద్మ, పద్మజ, మాజీ కౌన్సిలర్ లక్ష్మి, ఏఎస్ఐ చక్రి, వెంకటేశ్వరమ్మ, మాజీ ఎంపీపీ పార్వతమ్మ, సాజితా సికిందర్, యాదమ్మ, సౌమ్యశ్రీ, సింగిరెడ్డి కల్పన, ఆశమ్మను సన్మానించారు. పనికి తగ్గ ఫలితం కావాలని, వెట్టిచాకిరి విముక్తి కావాలని మహిళలు చేసిన పోరాట ఫలితమే నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుకుంటున్నామని ఐద్వా జిల్లా కార్యదర్శి పద్మ అన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య (ఐద్వా), తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం (టీపీఎస్‌కే) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి ఆమె పాల్గొని, మాట్లాడారు.



హన్వాడ ఎంపీడీవో యశోదమ్మను సన్మానించిన కార్యదర్శులు

పోలీసు కవాతు మైదానంలో



ఎస్పీ జానకికి బొకే ఇస్తున్న మహిళా ఉద్యోగులు

మహబూబ్‌నగర్ : జిల్లా పోలీసు కవాతు మైదానంలో శనివారం రాత్రి మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్పీ జానకికి మహిళా పోలీసు అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మహిళా ఉద్యోగులతో కలిసి కేక్ కట్ చేశారు. మహిళా పోలీసులు సమాజంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని వారి సేవలను కొనియాడారు.

● జడ్చర్ల : జడ్చర్ల మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ కళాభవన్‌లో మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న హింసను ప్రభుత్వాలు అరికట్టాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ కోరారు. మహిళ కార్మికులను శాలువాతో యూనియన్ నాయకులు సన్మానించారు. జడ్చర్ల ట్రస్మా ఆధ్వర్యంలో ఎంఈవో మంజులాదేవిని సన్మానించారు. సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ మౌనిక, డాక్టర్ నీలోఫర్, డాక్టర్ దీప్తి, డాక్టర్ రచన, రిటైర్డ్ టీచర్ జమీలాబేగం, ఉదయ మెమోరియల్ హైస్కూల్ ప్రిన్సిపాల్ వీణాశివకుమార్‌లకు ఫోరం సభ్యులు సన్మానించారు.

● మిడ్జిల్ : మండల కేంద్రంలో జడ్పీటీసీ మాజీ సభ్యురాలు హైమావతి, ఎన్.నిర్మల రాజేశ్వర్ పాల్గొని, మహిళల హక్కులపై అవగాహన కల్పించారు. బోయిన్‌పల్లిలో మార్కెట్ డైరెక్టర్ బంగారు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు ఉపాధి హామీ కూలీలను సన్మానించారు.

● మహబూబ్‌నగర్ టౌన్ : మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని మహబూబ్‌నగర్ ఆర్టీసీ ఆర్ఎం సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళా ఉద్యోగులకు పలు క్రీడలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన మహిళా ఉద్యోగులకు ఆర్ఎం ప్రతిభా పురస్కారాలు అందజేశారు.

● నవాబ్‌పేట : మండల కేంద్రంలోని సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవంలో జడ్పీటీసీ మాజీ సభ్యురాలు ఇందిరాదేవి, ఇసీడీఎస్ సూపర్ వైజర్ రాజేశ్వరి పాల్గొని, మహిళలను సన్మానించారు.



మాట్లాడుతున్న పైలట్ సంజన తడకంటి



మహబూబ్‌నగర్‌లో మహిళా మణులను సన్మానిస్తున్న నాయకులు

కాలనీకి దారి ఇవ్వాలి

» ఆందోళన చేపట్టిన కప్పెట గ్రామస్థులు



ఇంటి నిర్మాణం చేపట్టిన స్థలాన్ని పరిశీలిస్తున్న గ్రామస్థులు

భూత్పూర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో ఉన్న ప్రధాన కాలనీకి వెళ్లే దారికి అడ్డంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నారని, మా కాలనీకి దారి ఇప్పించండి అంటూ గ్రామస్థులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కప్పెట గ్రామానికి చెందిన ఓ బడా నాయకుడు తనకున్న అధికారాన్ని అడ్డు పెట్టుకొని వాల్మీకి ఆలయం దగ్గర ఉన్న కాలనీకి వెళ్లే దారికి అడ్డంగా 1200 గజాల స్థలంలో రెండు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. అయితే ఈ భూమి సర్వే నంబరు 32లో ఉందని, అది ప్రభుత్వ భూమి అని గ్రామస్థులు తెలిపారు. ఈ భూమి మొత్తం విస్తీర్ణం 10-14 ఎకరాలు ఉన్నట్లు మండల సర్వే అధికారులు గుర్తించారు. ఇదే విషయాన్ని గత సోమవారం మండల పరిషత్‌లో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో కాలనీవాసులు దరఖాస్తు చేసుకున్నారు. స్పందించిన రెవెన్యూ అధికారులు సర్వే అధికారి చేత కొలతలు చేయించారు. అయితే ఈ భూమిలో చాలా ప్రదేశం గ్రామస్థులు ఇళ్లు నిర్మించినట్లు తేలింది. కాలనీకి వెళ్లే దారిలో అధికార పార్టీకి చెందిన ఒక నాయకుడు అక్రమంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నారని, ఆ ఇంటి పక్కనే 12 ఫీట్ల స్థలాన్ని వెనుకాల ఉన్న కాలనీకి వెళ్లే దారి వదిలిపెట్టి నిర్మిస్తే అభ్యంతరం లేదని కాలనీవాసులు పేర్కొన్నారు. శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన గ్రామ పెద్దల సమావేశంలో సదరు ఇంటి నిర్మాణ దారుడు నిరాకరిండంతో ఇంటి నిర్మాణం చేపడుతున్న ప్రదేశంలో గ్రామస్థులు ఆందోళకు దిగారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ విజయలక్ష్మి ప్రభుత్వ స్థలం ఉన్న విషయం వాస్తవమేనని, ఆ భూమిలో కొంత భాగం ఇంటి నిర్మాణం చేపడుతున్న వ్యక్తి పేర ఉందని, దాన్ని గుర్తించి కాలనీకి వెళ్లే దారి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులతో నారాయణపేట డీఈవో గోవిందరాజులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు నూతన సాంకేతిక పరిజ్ఞానం అందించాలని నారాయణపేట డీఈవో గోవిందరాజులు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీకేరెడ్డి కాలనీలో గల ఫ్రీవింగ్ పాఠశాలలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు మంచి పరిజ్ఞానాన్ని అందించే విధంగా బోధన చేయాలని, నేటి సమాజంలో పోటీతత్వం పెరిగిపోయిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శబద్దీన్, ప్రిన్సిపాల్ జరీనా పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఇవ్వాలి



మాట్లాడుతున్న ఆదివాసి కాంగ్రెస్ అధ్యక్షుడు లింగం నాయక్

మహబూబ్‌నగర్ న్యూటౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ బెల్లయ్య నాయక్‌కు ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డిని, పార్టీ అదిష్టానాన్ని జిల్లా ఆదివాసి కాంగ్రెస్ చైర్మన్ లింగంనాయక్ విజ్ఞప్తి చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఆదివాసి లంబాడీలు ఉన్న ప్రాంతాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచిపోయినా ఆదివాసి లంబాడీలకు మంత్రివర్గంలో చోటు దక్కలేదన్నారు. రాజ్యసభ, ఎమ్మెల్సీ గవర్నర్ కోటాలో కూడా అవకాశాలు కల్పించలేదన్నారు. బెల్లయ్య నాయక్‌కు ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇచ్చి లంబాడాలకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో పట్టణ ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ రవి నాయక్, తులసీరాం, రామచందర్ నాయక్, హరినాయక్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పున్నయ్య

పాలమూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశానికి వారు పాల్గొని, మాట్లాడారు. రాష్ట్రంలో నేడు మీడియాకు గడ్డుకాలం ఏర్పడిందన్నారు. ఫెడరేషన్ సంఘం ఒక్కటే జర్నలిస్టుల సమస్యలపై పోరాటం చేస్తోందన్నారు. ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, అర్హులైన ప్రతీ జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల తరహా జర్నలిస్టులకు రిటైర్మెంట్ ఫించన్ ఇవ్వాలన్నారు. భవిష్యత్తులో ఫెడరేషన్ సంఘం సభ్యత్వాన్ని పెంచి అతిపెద్ద సంఘంగా ఏర్పాటు కోసం సభ్యులు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మంగళగిరి యాదగిరి, ఉమామహేశ్వర రావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.అశోక్, గోపాల్, పి.శ్రీనివాస్, రాంమోహన్, రామకృష్ణారెడ్డి, మోహన్‌గౌడ్, జి.ఆనంద్, భాస్కర్, నరసింహులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



కేక్‌కట్ చేస్తున్న కమతం భారతమ్మ, తదితరులు

మహమ్మదాబాద్ మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మహిళలలు అన్ని రంగాల్లో రాణించాలని అప్పుడే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని స్వర్గీయ మాజీ మంత్రి కమతం రాంరెడ్డి సతీమణి కమతం భారతమ్మ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని స్వగృహంలో మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. పారిశుధ్య, ఆశ వర్కర్లకు చీర లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. దుర్గా భజన మండలి సభ్యులు వెంకటమ్మ, మణిమాల, మమతమ్మ, మాజీ ఎంపీపీ అనురాధ, శేరి ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

నేడు బీసీ రాజకీయ చైతన్య సదస్సు

» హాజరుకానున్న తీన్మార్ మల్లన్న

పాలమూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : బీసీ రాజకీయ చైతన్య సదస్సును ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ జేఏసీ సమన్వయ కర్త సంగెం సూర్యారావు పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సదస్సుకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హాజరవుతారని తెలిపారు. భవిష్యత్‌లో మన ఓటు మనకే వేసుకొని బీసీ రాజ్యాధికారం సాధించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, చంద్రశేఖర్, శేఖర్, ఆంజనేయులు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం

మిడ్జిల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ఎంపీ డీకే అరుణ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేసేందుకు కృషి చేస్తున్నామని భారతీయ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంబీ బాలకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని బైరంపల్లి, వెలుగొమ్ముల గ్రామాల్లో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులను బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి, బీజేపీ మండల అధ్యక్షుడు నరేష్‌నాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో కేంద్రం ద్వారా ప్రత్యేక నిధులను తీసుకొచ్చి అన్ని విధాలా అభివృద్ధి పరిచేందుకు ఎంపీ డీకే అరుణ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు నరేందర్, మాజీ సర్పంచ్ బాల్‌రెడ్డి, నాయకులు సత్యంగౌడ్, నర్సింహ్మా రెడ్డి, కృష్ణయ్య, బాబా, రవీందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, భీరయ్య, బాల్‌రాజ్‌గౌడ్, చెన్నయ్య, దేవేందర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

» మరొకరి పరిస్థితి విషమం

మహబూబ్‌నగర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ మండలంలోని మన్యెంకొండ స్టేజీ సమీపంలో శుక్రవారం రాత్రి 10:30 గంటలకు బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ధర్మాపూర్‌కు చెందిన ఆత్కూరి కన్నయ్య(34), ఎద్దుల శివరాజు తీవ్రంగా గాయపడ్డారు. దేవరకద్ర కూలీ పనికి వెళ్లి తిరిగి ఇంటికెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో జనరల్ ఆసుపత్రికి తరలించగా.. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ఉస్మానియాకు తరలిస్తుండగా మార్గ మధ్యలో కన్నయ్య మృతి చెందాడు. శివరాజు పరిస్థితి విషయంగా ఉంది. బాధితుల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.